ప్రజాశక్తి

సోమవారం 18 సెప్టెంబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మోడల్ స్కూల్

- నాలుగేళ్లుగా పనిచేయని ఆర్‌ఒ ప్లాంట్
- టాయ్‌లెట్లకు లేని తలుపులు
- వేధిస్తున్న టీచర్ల కొరత
- బాలికల హాస్టల్‌కు వార్డెన్ కరువు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, చీడికాడ విలేకరి

పేద పిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకు ఏర్పాటుచేసిన మోడల్ స్కూల్స్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కనీస సౌకర్యాలకు నోచుకోలేకపోతున్నాయి. మంచినీరు మొదలుకొని, ఉపాధ్యాయుల సమస్య వరకు విద్యార్థులను వెంటాడుతున్నా పరిష్కరించే ప్రయత్నం చేయడంలేదు. అనకాపల్లి జిల్లా, చీడికాడ(మంచాల)లో 2013లో మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. ఈ మోడల్ స్కూల్‌లో ఆరు నుంచి ఇంటర్ వరకు 521 మంది విద్యార్థులున్నారు. వీరిలో బాలురు 180 మంది, బాలికలు 341 మంది వున్నారు. వీరికి నాలుగేళ్లుగా మంచినీటి సౌకర్యంలేదు. విద్యార్థుల హాస్టల్ వెనుకన పాఠశాల భవనంలో సనసూర్య అనే ప్రయివేటు సంస్థ ఏర్పాటు చేసిన ఆర్‌ఒ ప్లాంట్, బయో టాయ్‌లెట్స్ నాలుగేళ్ల నుంచి పని చేయడంలేదు. పాఠశాల భవనంతో పాటు నిర్మించిన టాయ్‌లెట్స్‌ను విద్యార్థులు సర్దుబాటు చేసుకుంటున్నారు. మంచినీరు లేక మోటారు నీరు తాగుతున్నారు. ఆర్‌ఒ ప్లాంట్ పనిచేయకపోయినా.. ఉందన్న పేరిట కొత్తగా ఆర్‌ఒ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరుచేయలేదు. మరమ్మతుకు గురైన ఆర్‌ఒ ప్లాంట్‌ను సనసూర్య బాగుచేయలేదు.

గతేడాది బదిలీపై వెళ్లిన తరువాత ఇంతవరకు ఇంటర్ విద్యార్థులకు బోధించే కెమిస్ట్రీ, సివిక్స్ అధ్యాపకులను నియమించలేదు. గతేడాది మిగతా 2లో..



మోడల్ స్కూల్‌లో పనిచేయని ఆర్‌ఒ ప్లాంట్



నిరుపయోగంగా ఉన్న బయో టాయ్‌లెట్స్



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ఉక్కు ప్రైవేటీకరణపై

ఉద్యమం ఉధృతం

- కేంద్రం కుట్రలను తిప్పికొడతాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయం నుంచి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెనక్కు తగ్గేవరకూ ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పార్టీ శ్రేణులకు, ప్రజలకు, కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. సిపిఎం విశాఖ జిల్లా ప్లీనం ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో లోకనాథం ముఖ్యవక్తగా పాల్గొని మిగతా 2లో..

స్వచ్ఛతలో ప్రథమ స్థానమే లక్ష్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరాన్ని స్వచ్ఛతలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరి సహకారం అవసరమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె ఆర్కే బీచ్ కాళీ మాత టెంపుల్ వద్ద తలపెట్టిన ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో పాల్గొన్నారు. జివిఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెయిట్ లిఫ్టర్ కరణం మల్లేశ్వరి, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, తదితరులూ భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ర్యాంకు సాధించేందుకు నగర ప్రజల సహకారం అవసరమన్నారు. 2022లో టాప్ ఇంక్వైరిటీ క్రియేటివ్ అవార్డు దక్కించుకున్న విషయాన్ని మిగతా 2లో..



తీరంలో శుభ్రతా చర్యల్లో హరివెంకట కుమారి, మల్లేశ్వరి

మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, షోరూం సిబ్బందికి
వినాయకచవితి శుభాకాంక్షలు



శ్రీ ఆదిలక్ష్మి జ్యూయలర్స్
SRI ADHILAKSHMI Jewellers
GOLD ♦ SILVER ♦ DIAMOND ♦ JEWELLERY
మా వద్ద 916 KDM, 22 CT బంగారు ఆభరణములు, నాణ్యత గల నవరత్నాలు మరియు వెండి గిఫ్ట్ ఆర్టికల్స్ లభించును.



ఊర్వశి జంక్షన్, కంచరపాలెం-8
మెయిన్‌రోడ్డు, విశాఖపట్నం.
సెల్: 81792 80757, 98493 10402
ఫోన్ : 0891-2730034, 35
ప్రొ॥ పి.ఎ.నాయుడు

Happy Vinayakachavithi Greetings to all..
Prajasakti 43rd Anniversary Day Greetings...



SYNERGIES
CASTINGS LIMITED
VSEZ, Duvvada, Visakhapatnam, Andhra Pradesh 530049

పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- వినాయక ఉత్సవాల్లో నిబంధనలు పాటించాల్సిందే..
- 'ప్రజాశక్తి'తో విశాఖ నగర పోలీసు కమిషనర్ రవిశంకర్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

విశాఖ నగరంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్టు ఇటీవల నగరానికి పోలీసు కమిషనర్‌గా వచ్చిన డాక్టర్ రవిశంకర్ తెలిపారు. వినాయక ఉత్సవాల్లో కమిటీలు నిబంధనలు పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని సూచించారు. గణపతి నవరాత్రుల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లును ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు.





మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి ?

మండపాలలో దీపారాధనల వల్ల అగ్నిప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ వైర్లు, ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో జాగ్రతలు వహించాలి. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరుగకుండా వైరింగ్ జాగ్రత్తగా చేయించుకోవాలి. విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం మిగతా 2లో..

Vinayakachavithi Greetings to all..
Prajasakti 43rd Anniversary Day Greetings...



FIRE AND SAFETY
One Year Course With Placement
Approved by M.H.R.D.
100% Placement Assistance
Admissions are in Progress for Academic Year 2023-2024
TECHMATE
INSTITUTE OF FIRE & SAFETY
Opp. 38 Bus Stop, 2nd Floor, Techmate Building
NH-5, Main Road, Old Gajuwaka, Visakhapatnam - 26
Cell : 8328525503

మొదటి పేజీ తరువాయి..

మో'డల్' స్కూల్

నుంచి కాలం నెట్టుకొచ్చే పనిచేస్తున్నారుతప్ప క్లాసులు బోధించే పని జరగడంలేదు. కెమిస్ట్రీ, సివిక్స్ క్లాసులు సరిగా అవ్వడంలేదని విద్యార్థులు 'ప్రజాశక్తి' వద్ద వాపోయారు. హిందీ టీచర్ గతేడాది నుంచి లేకపోయినా నియమించలేదు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి, బైపిసి విద్యార్థులు 51 మంది, రెండో ఏడాది విద్యార్థులు 52 మంది ఉన్నారు. వీరికి కెమిస్ట్రీ బోధించే అధ్యాపకుడు లేరు. వచ్చే ఫలితాలపై ప్రభావం చూపనుంది.

బాలికలు ఉపయోగిస్తున్న టాయ్‌లెట్స్‌కు తలుపులు లేవు. వంద మంది బాలికల హాస్టల్స్‌కు 2019 నుంచి వార్డెన్ లేరు. తాత్కాలికంగా ఎవరో ఒకరిని ఇక్కడ సర్దుబాటు చేస్తూ ఉన్నతాధికారులు కాలం నెట్టుకొస్తున్నారు. దీంతో విద్యార్థుల రక్షణ, బాగోగులు ప్రశ్నార్థకమయ్యాయి. ఇక్కడ హాస్టల్ సదుపాయం తొమ్మిది నుంచి ఇంటర్ చదువుతున్న వంద మంది బాలికలకు వుంది. తొమ్మిది నుంచి ఇంటర్ చదువుతున్న బాలికలు దాదాపు 200 మంది వరకు వున్నారు. కానీ వీరిలో వంద మందికే హాస్టల్ సదుపాయం వుండడంతో మిగిలిన బాలికలు సైకిళ్ళు, బస్సు, ఆటోల్లో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నారు. మొత్తంగా చూస్తే... ఆరు నుంచి ఇంటర్ వరకు 341 మంది బాలికలు మోడల్ స్కూల్లో చదువుతున్నారు. వీరందరికీ హాస్టల్ వసతి కల్పించాల్సివుంది. మోడల్ స్కూల్ పాఠశాల అసౌకర్యాలపై సంబంధిత అధికారులు స్పందించడంలేదు.

తక్షణమే సౌకర్యాలు కల్పించాలి

మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లాం. బాలికల హాస్టల్‌కు వార్డెన్ లేకపోవడం బాధాకరం. మహిళా హెల్త్ వర్కర్‌ను నియమించాలి. నిధులు విడుదలచేసి బాత్‌రూమ్‌ల తలుపులు, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి. మంచినీటి సౌకర్యం కల్పించాలి. తిమిరాం, వాకపల్లి, చీడిపల్లి, తురువోలు, తంగడుబిల్లి మీదుగా స్కూల్‌కు ఆర్‌టిసి బస్సు నడపాలి.



డి.వెంకన్న, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

ఉక్కు ప్రైవేటీకరణపై ఉద్యమం ఉధృతం

మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ దూకుడును వేగవంతం చేసిందన్నారు. అందులో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌ను అమ్ముతున్నట్లు రెండేళ్ల క్రితం ప్రకటించిందన్నారు. ప్లాంట్ రక్షణ కోసం సిపిఎం అనేక రూపాల్లో పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. 947 రోజులుగా ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ప్రజలు పెద్దఎత్తున పోరాడుతున్నా బిజెపి ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోవడం దారుణమన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమగా ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడానికి బిజెపి ప్రయత్నిస్తుంటే రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం, ప్రతిపక్ష టిడిపి, జనసేనలు మాత్రం బిజెపి నిర్ణయాన్ని గట్టిగా తిప్పికొట్టకపోవడం హేయమైన చర్యని పేర్కొన్నారు. గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టు, రైల్వే, విశాఖపట్నం పోర్టు, రక్షణ రంగం వంటి ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలన్నింటినీ అంబానీ, అదానీలకు కట్టబెడుతుంటే వాటిని కాపాడకుండా బిజెపికి వంతపాడటం శోచనీయమన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపిని టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు పల్లెత్తుమాటాడకుండా ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. దేశంలో బిజెపిని ఓడించేందుకు ఇండియా కూటమి ఏర్పడినా.. దానిలో కూడా ఈ పార్టీలు చేరలేదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు అరెస్టుతో రాజకీయ వేడి పెరిగిందన్నారు. రాష్ట్ర వైసిపి ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపైనా, నాయకులపైనా ఉక్కుపాదం మోపుతోందని, ప్రతిపక్ష పార్టీలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని తెలిపారు. చంద్రబాబు అరెస్టు చేసే విధానాన్ని సిపిఎం ఖండించిందన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా రాజకీయ వాతావరణాన్ని సృష్టించడం ప్రమాదకరమన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం ప్రజా సమస్యలపై అక్టోబర్‌లో బస్ యాత్ర నిర్వహించి, నవంబరు 7న విజయవాడలో లక్షలాది మందితో సభ ఏర్పాటు చేస్తోందన్నారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యాన ఉత్తరాంధ్రలో తలపెట్టిన ఉక్కు రక్షణ బైకు యాత్ర ఏర్పాట్లును వివరించారు. 20న విశాఖ జివిఎంసి వద్ద ప్రారంభమయ్యే ఈ యాత్ర విజయనగరం, శ్రీకాకుళం, మన్యం పార్వతీపురం, అరకు, పాడేరు, అనకాపల్లి మీదుగా కూర్మన్నపాలెం చేరుకుంటుందన్నారు. విశాఖలో దీని ఉపజాతా 21న ప్రారంభమై 26 వరకూ కొనసాగుతుందన్నారు. ఈ యాత్రలో ప్రజలు, కార్మికులు, యువతీ యువకులు, మహిళలు భాగస్వామ్యం కావాలన్నారు. 29న జరిగే బహిరంగ సభకు వేలాది మంది కదిలి రావాలన్నారు. ప్లీనంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, బొట్టా ఈశ్వరమ్మ, డాక్టర్ బి.గంగారావు, కెఎం.శ్రీనివాస్, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ప్రథమ స్థానమే లక్ష్యం

గుర్తుచేశారు. బీచ్ క్లీనప్ ప్రోగ్రాంను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్‌రావు, కార్పొరేటర్ వంశీరెడ్డి, లేళ్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలుగు జాతి ఆత్మగౌరవం పేరుతో తాను నిర్వహించాల్సిన సభకు అనుమతులు ఇవ్వకుండా ప్రజాస్వామ్యాన్ని వైసిపి ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఆదివారం మధ్యాహ్నం రామకృష్ణ బీచ్‌లో బహిరంగ సభ నిర్వహించాల్సి ఉండగా ఈ నెల 13న అనుమతి కోరుతూ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించానన్నారు. అయినప్పటికీ అనుమతి నిరాకరించారని తెలిపారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చంద్రబాబును విమర్శించడంలోనే ముందుంటున్నారని తెలిపారు. ఆయనకు ఏమీ చేతకాదన్నారు. ఎప్పటికైనా ప్రజాస్వామ్యంలో అంతిమ విజయం ప్రజలదేనని, రాబోయే ఎన్నికలలో వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ప్రభుత్వ అణచివేత చర్యలపై పోరాటం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతిపక్ష పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలపై రాష్ట్ర ప్రభుత్వ అణచివేత, నిర్బంధం, కక్షపూరిత చర్యలకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలూ ఒకే తాటిపైకి వచ్చి పోరాటం నిర్వహించాలని, పౌర సమాజం కూడా పెద్ద ఎత్తున ఉద్యమించాలని పలు రాజకీయ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షత వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పౌర సమాజం పెద్ద ఎత్తున ముందుకు వచ్చి ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, ఇలాంటి చర్యలను ఇంతకు మునుపెన్నడూ చూడలేదని అన్నారు. చంద్రబాబు అరెస్టు తీరును ఖండిస్తున్నామని చెప్పారు. ప్రజల కోసం



అభివాదం చేస్తున్న పలు రాజకీయ పార్టీల నేతలు

ఉద్యమించే కమ్యూనిస్టుల గొంతు నొక్కుతున్నారని అన్నారు. కేంద్రంలోని బిజెపి తనకు వ్యతిరేకంగా ఉన్నవారిపై ఇడి, ఐటి, సిబిఐ లాంటి సంస్థలను ప్రయోగిస్తోందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ పెద్ద ఎత్తున భూకబ్జాలకు పాల్పడుతున్న వైసిపి నేతలను ముందుగా అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూగి శ్రీనివాసరావు, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకురాలు డాక్టర్ సీతల్, లోక్‌సత్తా నాయకులు ఎంఎస్ఎన్.మూర్తి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వి డెంటల్ హాస్పిటల్‌కు ఉత్తమ సేవా అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో వి డెంటల్ అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జెసిఐ) విశాఖ ఎక్సలెన్స్ చాప్టర్ ఉత్తమ పురస్కారాన్ని అందించింది. రామ్‌నగర్ లైన్స్ క్లబ్ సమావేశ మందిరంలో జరిగిన జెసిఐ వీక్ జైత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా వి డెంటల్ హాస్పిటల్‌ను బెస్ట్ డెంటల్ క్లినిక్ అవార్డుకు ఎంపిక చేశారు. నగరంలో పలు చోట్ల ఉచిత దంత వైద్య శిబిరాల ద్వారా వేలాది మందికి దంతాల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్న వి డెంటల్ హాస్పిటల్‌కు ఈ ఉత్తమ సేవా అవార్డు లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. పురస్కారాన్ని హాస్పిటల్ కార్పొరేట్ మేనేజర్ కె.పృథ్వీరాజ్‌కు జెసిఐ ప్రతినిధులు



అవార్డు స్వీకరిస్తున్న కె.పృథ్వీతేజ్

అందించి సత్కరించారు. కార్యక్రమంలో జెసిఐకి చెందిన పలు చాప్టర్స్ ప్రతినిధులు పాల్గొని వి డెంటల్ అందిస్తున్న సేవలను కొనియాడారు. జెసిఐ విశాఖ ఎక్సలెన్స్ చాప్టర్ ప్రెసిడెంట్ చంద్ర శేఖర్, జెసిఐ వీక్ ఛైర్‌పర్సన్ ఫణి కళ్యాణ్, రాజేష్ ఉట్టి, భార్గవ ప్రియ ఉట్టి తదితరులు పాల్గొన్నారు.

జగన్ దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం సాయంత్రం టిడిపి కార్యాలయం ఎదుట ఉన్న రోడ్డులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను టిడిపి కార్యకర్తలు దగ్ధం చేశారు. సైకో పోవాలి, సైకో సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

ఎంఆర్‌పిఎస్ దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎబిసిడి ఎస్‌సి వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిరాహార దీక్ష నిర్వహించారు. నాయకులు తొత్తమూర్తి శ్రీనివాస, ఉపాది అచ్చారావు, వైవిటిఎన్.ప్రసాద్, కడితి శివ, గౌరీ ప్రసాద్, కడితి శైలేష్, ముప్పిడి రాము పాల్గొన్నారు.

ఘనంగా పెరియార్ రామస్వామి జయంతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆధునిక విప్లవవాది, సామాజిక ఉద్యమ నాయకులు పెరియార్ ఇవి రామస్వామి 145వ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఆర్‌కె బీచ్‌లోని పెరియార్ విగ్రహం వద్ద భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు టి.శ్రీ రామమూర్తి, మురళి, రవి, అజయ్ పాల్గొన్నారు. పెరియార్ రామస్వామి ఉద్యమాలను స్మరించుకున్నారు.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి..) నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం, విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియజేయాలి. పందిళ్లు, మండపాలు వద్ద శబ్ద కాలుష్య క్రమబద్ధీకరణ, నియంత్రణ నిబంధనలు - 2000 ప్రకారం రెసిడెన్షియల్ ఏరియాలో పగలు 55, రాత్రి 45 డెసిబల్స్‌కు మించకుండా ఉండే విధంగా స్పీకర్లను ఉపయోగించాలి. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలి.

లౌడ్ స్పీకర్ల విషయంలో పలు నిబంధనలు వర్తిస్తాయన్న విషయం మరువరాదు. గణేష్ మండపాల వద్ద అశ్లీల పాటలు పాడకూడదు. అశ్లీల ప్రదర్శనలు తగవు.

మండపాల నిర్వాహకులకు ఇచ్చే సూచనలేంటి ?

మండపాల నిర్వాహకులు బలవంతంగా విరాళాలు సేకరించరాదు, పటాకులు పేల్చడం, రంగులు చల్లడం, నినాదాలు చేయడం, ఫ్లకార్డులతో ఇతర గ్రూపులను రెచ్చగొట్టడం నిషేధం. భద్రత కోసం రాత్రి సమయాల్లో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ వారి ప్రతినిధులు కాపలా ఉండాలి. ఎవరికి వారు తగు భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలి. రాత్రి సమయాలలో పందిళ్లు, మండపాలలో డబ్బులు, బంగారం లాంటి విలువైన వస్తువులు ఉంచకూడదు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఏ పనీ చేయరాదు.

నిమజ్జనంలో పాటించాల్సిన నియమాలేంటి ?

ఊరేగింపు సమయంలో ఇతర కులాలు, మతాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయరాదు. విగ్రహ నిమజ్జన ఊరేగింపు సమయంలో గులాములు/రంగులు చల్లడం, లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం, మందుగుండు సామగ్రి పేల్చడం చేయరాదు.

ఊరేగింపు సమయంలో పోలీస్ అనుమతి లేకుండా వేషధారణలు, ఎక్కువ శబ్దం వచ్చే వాయిద్యాలు ఉపయోగించరాదు. నిమజ్జనానికి వెళ్లే వాహనంపై మద్యం లేదా మత్తు పదార్థాలను సేవించిన వారు, మైనర్లు ఉండకూడదు. నగరంలో రాత్రి 11 గంటల తర్వాత నిర్ణీత సమయానికి మించి విగ్రహాల నిమజ్జనానికి అనుమతిలేదు.

పూజా సామగ్రి ధరలకు రెక్కలు



తగరపువలసలో పూలు, పత్రిని విక్రయిస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి -తగరపువలస

వినాయక చవితి పండుగ నేపథ్యంలో తగరపువలస ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రైవేట్ మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. మార్కెట్ లోపల, డివైడర్‌పై కూడా పూజా సామాగ్రి, పత్రి, మట్టి వినాయక ప్రతిమల అమ్మకాలు జరిగాయి.

గతేడాది కంటే ఈ ఏడాది పూజా సామగ్రి ధరలు పెరిగాయి. ఉసిరి, మారేడు, నేరేడు, శీతాఫలం, మామిడి, జామి, తంగేడు, తులసి, మర్రి, గరికి, పత్రి, పండ్లతో కలిపి ఏతా వాతా రూ.500 పైబడి ధర పలికింది. కేవలం పత్రి ధర రూ.20గా ఉంది. గతంలో పత్రి, పండ్లు కలిపి రూ.200కు లభించేవని, ప్రస్తుతం సగానికి పైగానే ధరలు పెరిగాయని కొనుగోలు దారులు వాపోయారు. గతంలో పత్రి కేవలం రూ.5కే లభించేదని పలువురు మహిళలు తెలిపారు.

సాధారణంగా ఇక్కడి ప్రైవేట్ మార్కెట్ ఆదివారం రద్దీగా ఉంటుంది. ఉద్యోగులకు శెలవు దినం కావడంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి గొర్రెలు, కోళ్లు, ఎప్పటి లాగానే కూర గాయలు అమ్మేందుకు అధిక సంఖ్యలో వస్తుంటారు. దీంతో మార్కెట్ కిటకిటలాడుతుండడం సహజం. పండగలు, పబ్బాలు వస్తే మార్కెట్ వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. జంక్షన్ వద్ద నుంచి మార్కెట్ మీదుగా నడిచి వెళ్ళాలంటే ఎక్కువ సమయం పడుతుంది

రూ.20 నుంచి వినాయక ప్రతిమలు

మార్కెట్ లో ఒక్కో వినాయకుని బొమ్మ రూ20 నుంచి రూ.7 వేల వరకు అమ్మకాలు జరిగాయి. మట్టి వినాయక విగ్రహాలు, రంగులు పూసిన విగ్రహాలు సైజును బట్టి వాటి ధరలు పలికాయి.

ధరలు బాగా పెరిగాయి

ఎటూ పప్పు, ఉప్పు, బియ్యం, వంట నూనె ధరలు, కరెంట్ ఛార్జీలు పెరిగాయి. ఏదోలా సంప్రదాయంగా వస్తున్న వినాయక చవితి పండుగ చేసుకుందామంటే పూజా సామగ్రి ధరలు కూడా పెరిగాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ధరల పెరుగుదల ఇబ్బందిగా ఉంది.



అత్తిలి గంగా భవాని
అల్లూరి సీతారామరాజు కాలనీ

30 నుంచి ఎయు తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం బిటెక్, బిఆర్క్, ఎంటెక్, ఎంఆర్క్, ఎంసిఎ, ఎమ్మెస్సీ ప్రథమ సంవత్సరం తరగతులు ఈ నెల 30న ప్రారంభించనున్నారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులనుద్దేశించి ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం తరగతులను లాంఛనంగా ప్రారంభిస్తారు. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులు 30న ఉదయం 9 గంటలకు విద్యార్థులు, తల్లిదండ్రులు కన్వెన్షన్ సెంటర్‌కి చేరుకోవాలని ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు సూచించారు. విద్యార్థులు ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి తమ విభాగాలకు వెళ్లి రిపోర్ట్ చేయాలని సూచించారు. సంబంధిత విభాగాధిపతులు విభాగానికి వచ్చే విద్యార్థులకు అవసరమైన సమాచారం అందించే ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. హాస్టళ్ల చీఫ్ వార్డెన్లు ఈ నెల 28 నుంచి విద్యార్థులకు వసతి సదుపాయాన్ని కల్పించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ నెల 28 నుంచి హాస్టల్స్‌లో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు.

ప్రజల ఆకాంక్షలు రచయితలచే అక్షరబద్ధం

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రజల ఆకాంక్షలను రచయితలు అక్షరబద్ధం చేస్తారని, ప్రజలు ఆ రచనలనే చదివి తమ ఆకాంక్షల్లో న్యాయం ఉందని గ్రహించి, దాని చుట్టూ ఉద్యమం చేస్తారని, దాని ఫలితంగా చట్టం వస్తుందని ప్రముఖ రచయిత్రి ఓల్గా తెలిపారు. కొండపల్లి కోటేశ్వరమ్మ ఐదో వర్ధంతి సందర్భంగా ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యాన 'చట్టం – సాహిత్యం' అంశంపై ఆమె స్మారకోపన్యాసం చేశారు. సమాజంలో ఎలాంటి చట్టాలు రావాలన్న దానిపై సాహిత్యం ఎప్పుడూ చర్చిస్తూ ఉంటుందని పేర్కొన్నారు. మనుషుల్లో సంస్కారం పెరుగుతున్న క్రమంలో సమాజాన్ని మార్చుకోవాలన్న ఆకాంక్ష పెరుగుతుందని తెలిపారు. దానికి రచయితలు ఒక రూపం ఇస్తారని పేర్కొన్నారు. ఆలోచన ద్వారా సంస్కారం, దాని నుంచి కార్యాచరణలోకి వెళ్లేందుకు ప్రయత్నించాలని అభిప్రాయపడ్డారు.

నేటి నుంచి అంతర్జాతీయ గోల్ఫ్ పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో మొదటిసారిగా ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పిజిటిఐ) ఆధ్వర్యాన ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు అంతర్జాతీయ గోల్ఫ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ కార్యవర్గ సభ్యులు తెలిపారు. దీనికి సంబందించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు చెప్పారు. ముడసర్లోవ రిజర్వాయర్ సమీపంలోని ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ క్లబ్ కార్యదర్శి మంతెన సత్యనారాయణరాజు మాట్లాడుతూ, ఈ పోటీలను తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ రాజేష్ పెంథార్కర్ ప్రారంభించనున్నట్టు తెలిపారు. 18వ ప్రాక్టీస్ రౌండ్, 19న ప్రోయామ్ టోర్నమెంటు, సెప్టెంబరు 20 నుంచి 23 వరకు ప్రధాన టోర్నమెంటు జరుగుతాయని వివరించారు. ఈ నెల 23న ఇపిజిసిలో జరగనున్న బహుమతి ప్రదానోత్సవానికి ఎపి ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో భారతదేశంతో పాటు శ్రీలంక, కెనడా, బంగ్లాదేశ్, నేపాల్, జపాన్ దేశాల నుంచి సుమారు 126 మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. ఈ టోర్నమెంట్‌ను యూరో స్పోర్ట్, సోషల్ మీడియా స్ట్రీమింగ్ ఎబిపి వార్తలలో ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు. దూరదర్శన్‌లో కూడా ప్రదర్శిస్తారని తెలిపారు. సామాన్యులకు కూడా అవగాహన కల్పించేందుకు నగరంలోని ప్రముఖ స్థలాల్లో హోర్డింగ్‌లు, టోర్నమెంట్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ట్రెజరర్ రామకృష్ణ, ఉపాధ్యక్షులు వినోద్‌బాబు, సభ్యులు నర్సింహరాజు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ క్లబ్ కార్యవర్గ సభ్యులు

కార్మికుల వైపే న్యాయం

భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధనరావు



సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధనరావు

ప్రజాశక్తి -తగరపువలస : సుదీర్ఘ కాలంగా జరుగుతున్న న్యాయపోరాటంలో చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికుల వైపే న్యాయం ఉంటుందని, ఇది వాస్తవమని చిట్టివలస జ్యూట్ మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం న్యాయ సలహాదారు, భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.జనార్ధనరావు జ్యూట్ కార్మికులకు స్పష్టం చేశారు. చిట్టివలస జ్యూట్ మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం ఆధ్వర్యాన ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యంతో నాలుగు కార్మిక సంఘాలు, ప్రభుత్వం కలిసి గతంలో చేసుకున్న ఒప్పందం చట్ట విరుద్ధమన్నారు. మెజారిటీ కార్మికుల భాగస్వామ్యం, ఆమోదం లేని ఎటువంటి ఒప్పందమైనా సరే చట్ట వ్యతిరేకమైనదని తెలిపారు. చట్ట ప్రకారం కార్మికులకు అందాల్సిన పరిహారం కోసం చేస్తున్న న్యాయపరమైన పోరాటంలో తుదకు యాజమాన్యం ఓడి పోతుందని, అనివార్యంగా కార్మికులే విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. కోర్టు ఆదేశాలను సైతం అనేక సందర్భాల్లో బేఖాతరు చేసిన యాజమాన్యం త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికులు అడుగుతున్న పరిహారం వారి హక్కు అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు వివిఎస్ఎ.నరసింహరాజు, కార్యదర్శి జె.వెంకటరమణ, సభ్యులు గిడుతూరి శ్రీనివాసరావు, జె.రమణ తదితరులు పాల్గొన్నారు.



అదనపు భవనం ప్రారంభంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి ఆనందపురం : పేదలందరికీ మెరుగైన వైద్యం అందించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు భవనం ఏర్పాటుకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.50 లక్షలు వ్యయంతో నిర్మించబోయే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు భవనం (వైరస్ పరీక్ష ల్యాబ్) వల్ల మెరుగైన వైద్యం అందించడానికి దోహదపడుతుందన్నారు.

విద్య, వైద్యంలో జగన్మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రతి మండలానికి రెండు పిహెచ్‌సిలు ఏర్పాటుచేసి, కుటుంబ డాక్టర్ విధానం తీసుకొచ్చి, పిహెచ్‌సిలో ఒకరు, ఫీల్డ్‌లో ఒక డాక్టర్ ఉండేలా విప్లవాత్మకమైన మార్పులు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ జగదీశ్వరరావు, ఉమావతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఎం.గంగునాయుడు, షహనాజ్ సాదియా, ఆరోగ్య కమ్యూనిటీ అధికారి సాంబమూర్తి, సిసి నాగభూషణం, జడ్‌పిటిసి కోరాడ వెంకట్రావు, వైసిపి నాయకులు మజ్జి వెంకట్రావు, బంక్ సత్యనారాయణ, శ్రీను, బొట్ట రామకృష్ణ, సర్పంచ్ లోడగల రాజేశ్వరి, రమణ, చందక లక్ష్మి సూరిబాబు, రౌతు శ్యామల వెంకట్రావు పాల్గొన్నారు.



సింహాచలం ఇఒగా బాధ్యతలు స్వీకరిస్తున్న సింగాల శ్రీనివాసరావు

సింహాచలం ఇఒగా సింగాల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానం నూతన ఇఒగా సింగాల శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి ఇఒగా ఉన్న వి.త్రినాథరావు నుంచి సోమవారం కొండపైన ఆస్థాన మండపం వద్ద బాధ్యతలు స్వీకరించారు. ముందుగా సింగాల శ్రీనివాసరావు దంపతులు సింహాద్రి అప్పన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బాధ్యతలను స్వీకరించారు. అక్కడి నుంచి నేరుగా కొండ దిగువన ఉన్న కార్యాలయానికి వచ్చి సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఆగమ పాఠశాలకు వెళ్లి విద్యార్థులు వివరాలు, వారికి అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆఫీస్ పరిసరాలను పరిశీలించి తదుపరి కొండపైకి వెళ్లి అన్నదానంలో భక్తులకు అందిస్తున్న ఆహారం పరిశీలించారు. అన్నప్రసాదం ఎలా ఉందని భక్తులనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సహాయ కార్య నిర్వహణాధికారి రమణమూర్తి ఇఇలు శ్రీనివాస్‌రాజు, రాంబాబు, అన్నదానం సూపరింటెండెంట్ పాలూరి నరసింహారావు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన చిన్న బజారులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. వైద్యులు జగన్నాథరావు, టిజె.మోహన్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, చంద్రశేఖర్, భానోజీరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



మహాజనసభలో మాట్లాడుతున్న జిటిపి ప్రకాష్

హెచ్‌పివిపి త్రిఫ్ట్ సభ్యులకు రుణపరిమితి పెంపు

ప్రజాశక్తి -గాజువాక : భెల్ హెచ్‌పివిపి ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ పాలకవర్గ సభ్యులకు రుణ పరిమితి పెంచుతున్నట్లు సొసైటీ డైరెక్టర్ జిటిపి.ప్రకాష్ తెలిపారు. సొసైటీ 54వ మహాజనసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యదర్శి నివేదికపై మాట్లాడుతూ, సంఘ సభ్యులకు రుణ పరిమితిని రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. రుణ పరిమితిపై 14 శాతం ఉన్న వడ్డీని 13 శాతానికి తగ్గిస్తున్నట్లు వివరించారు. సొసైటీని ఆర్థికంగా బలోపేతం చేయాలని సభ్యులకు సొసైటీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. సొసైటీలో ప్రస్తుతం ఉన్న ఇద్దరు సిబ్బంది 2024వ సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేయనున్నారు కాబట్టి వీరి స్థానంలో అర్హత కలిగిన సిబ్బందిని నియమించాలన్నారు. సొసైటీని ప్రగతి పథంలో నడపడానికి సభ్యులు సరికొత్త ఆలోచనలతో సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో మేనేజర్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బౌద్ధారామాల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి బీచ్ రోడ్డు జివిఎంసి 4వ వార్డు పరిధిలో తొట్లకొండపై ఉన్న బౌద్ధారామాల అభివృద్ధికి, వాటి పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు, మాజీ కౌన్సిలర్ జివి.రమణ ప్రభుత్వాన్ని కోరారు. జివిఎంసి ఒకటో వార్డు, సంతపేటలో ఆదివారం స్థానికులకు బౌద్ధారామాల ప్రాధాన్యతను ఆయన వివరించారు. దళితులకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సామాజిక భవనం మంజూరుకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సృజన, లత, ఎల్లయ్యమ్మ, జగదీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్లాబ్ తొలగించారు.. నిర్మాణం మరిచారు...

మొండిగా దర్శనమిస్తున్న గ్రంథాలయం

ప్రజాశక్తి -గాజువాక : కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలిక ఊడినట్టుగా పెదగంట్యాడ గ్రంథాలయ భవనం పరిస్థితి తయారైంది. పెదగంట్యాడలో 1997వ సంవత్సరంలో గ్రంథాలయాన్ని నిర్మించారు. ఇది మరమ్మతులకు గురికావడంతో రిపేర్లు చేయాలని ఏడాది క్రితం గ్రంథాలయ పైకప్పు తొలగించారు. దాని స్థానంలో రూ.10 లక్షలతో శ్లాబ్ నిర్మాణం చేపడతామని ఇంజినీరింగ్ అధికారులు ఎస్టిమేషన్ తయారుచేశారు. తర్వాత అధికారుల ఆలోచన మారింది. శ్లాబ్ వేసినా గోడలు అంత నాణ్యతగా లేవని, భవిష్యత్తులో ప్రమాదకరమని భావించి మరలా ఇంజినీరింగ్ అధికారులు గోడలు కూడా తొలగించి పూర్తిగా నిర్మాణానికి నివేదికలు తయారుచేసే పనిలో పడ్డారు. ఉన్న గ్రంథాలయం శ్లాబ్ తొలగించడంతో పుస్తకాలను పక్కనే ఉన్న స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భవనంలో భద్రపరిచారు. శాశ్వత భవనం నిర్మించకుండా ఎన్ని సంవత్సరాలు పాటు ఇలా పుస్తకాలను పక్క భవనంలో ఉంచుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి గ్రంథాలయ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై గ్రంథాలయ అధికారిని వివరణ కోరగా ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని చెప్పారు.



శ్లాబ్ తొలగించిన గ్రంథాలయం

పలుచోట్ల విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న కేంద్రమంత్రి దేవ్‌సింగ్ చౌహాన్

విశ్వకర్మ జయంతిని పలుచోట్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

సీతమ్మధార : సాగరమాల ఆడిటోరియంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. పలువురు చేతివృత్తుల పనివార్లను కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి దేవ్‌సింగ్ చౌహన్, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి దేవ్‌సింగ్ చౌహన్ మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి గుర్తింపు పొందే విధంగా కళాకృతులను తయారు చేయాలని చేతి వృత్తిదారులకు సూచించారు. చేతి వృత్తుల వారికి మంత్రి అమర్‌నాథ్ విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

తగరపువలస : స్థానిక శ్రీ విశ్వకర్మ కార్పెంటర్ల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న సంఘం సభ్యునికి ఒఎన్‌జి ఫౌండేషన్ సహకారంతో సోషల్ వర్కర్ వెంపాడ శ్రీనివాసరెడ్డి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు జగుపల్లి వెంకటరమణ, ప్రతినిధులు కనిమెల్ల శ్రీను, రాము, తమ్మిన అప్పారావు, వై.రాంబాబు, గిడిజాల రమేష్, బ్రహ్మానందం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి: పనిముట్లు తయారీ, నిర్మాణాలకు విశ్వకర్మే ఆద్యులని. వారి జయంతిని జరుపుకోవడం ఆనందంగా ఉందని డిఆర్‌ఒ బి.దయానిధి అన్నారు. కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని విశ్వకర్మ చిత్రపటానికి జ్యోతి వెలిగించి పూలమాల వేశారు.బీసీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కే.రాజేశ్వరి మాట్లాడుతూ .రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పీఎం విశ్వకర్మ కౌసల్య యోజన పథకాన్ని కేంద్రం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్మన్ బీసెట్టి వరాహ సత్యవతి, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి, సామాజిక వర్గ నాయకులు కాశీ వరహాలు, ఎం. కోటేశ్వరరావు, టీ ప్రకాష్ రావు, పి.శ్రీనివాసరావు, జి.భారతి జిల్లా విశ్వబ్రాహ్మణ పంచ వత్తుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వడ్డాది : మండల విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు గిడుతూరి ఈశ్వరరావు అధ్యక్షతన విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు అనంతరం దంపతులచే సామూహికంగా కళశాలు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావికమతం మండల విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఓంపోలు ఆచారి, జెడ్‌పిటిసి దొండా రాంబాబు, వైస్ ఎంపిపి దొండా లలిత, నారాయణమూర్తి, బత్తుల తాతయ్యబాబు గిరిబాబు. పట్నాల జగదీష్, బి.శ్రీనివాస్, పట్నాల రత్నాజీ, దొండా సాయి పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు



అరగుండు గీయించుకున్న తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు

భీమునిపట్నం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ వారం రోజులుగా స్థానిక టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 8వ రోజుకు చేరాయి. బాబుతో నేను పేరిట చేపట్టిన దీక్షలో పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సరగడ అప్పారావు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారిలక్ష్మి, నాయకులు యరబాల అనిల్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దీక్షలకు జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు.

గాజువాక : అక్రమ అరెస్టును నిరసిస్తూ సిబిఎన్ మిత్రమండలి బృందం సభ్యులు అగనంపూడి నుంచి సింహాచలం వరకు పాదయాత్ర చేశారు. పెదమడకలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్ర ప్రారంభించారు. దువ్వాడ మీదగా సింహాచలం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లి శ్రీనివాసరావు, బలిరెడ్డి సత్యనారాయణ, అండబోయిన గురుమూర్తి పాల్గొన్నారు.

గోపాలపట్నం : పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన గోపాలపట్నం మెయిన్ రోడ్డులో 9 రోజులుగా నిరసనలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు అరగుండు కొట్టించుకొని నిరసన ప్రదర్శన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పొలిమేర సీతారాం, బొడ్డేటి విజయ్, నందవరపు సోములు, ఎం.సోమేష్, రామ్మోహన్, వాసుదేవరావు, జోజి, కంపర ఆనంద్, ప్రతాప్, దాడి సురేష్, గవ్వ భాస్కర్, సింహాద్రి పాల్గొన్నారు.

అనకాపల్లి : అక్రమ కేసులో జైలుకెళ్లిన టిడిపి అధినేత చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు స్పష్టం చేశారు. చంద్రబాబు అరెస్టు నిరసిస్తూ , బెయిల్‌పై విడుదల చేయాలని కాంక్షిస్తూ మెయిన్ రోడ్‌లోని సెంటనరీ బాప్టిస్ట్ చర్చ్ సంఘ అధ్యక్షులు జోసఫ్ ఆధ్వర్యంలోఆదివారం ప్రార్థనలు చేశారు.కార్యక్రమంలో డాక్టర్ కేవీవి నారాయణరావు, కాండ్రేగుల సత్యనారాయణ, కోట్ని రామకష్ణ, బోడి వెంకట్రావు, మళ్ల శివన్నారాయణ, మళ్ళ గణేష్, బొడ్డేడ మురళి, పివివి రమణ, అండిబోయిన శేషు, సాలపు నాయుడు, బుద్ద భువనేశ్వరరావు , సూరిశెట్టి బల్లమ్మ పాల్గొన్నారు.

చోడవరం : చంద్రబాబుఅక్రమ అరెస్టును ప్రతిఒక్కరూ ఖండించాలనిఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. ఆదివారం టిడిపి చేపట్టిన నిరసన దీక్షలో పాల్గొన్నారు. రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసిన చంద్రబాబును జైలుపాల్జేసిన వారికి తగిన గుణపాఠం తప్పదన్నారుఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, నియోజకవర్గ ఇన్చార్జ్ బత్తుల తాతయ్య బాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ జి వెంకట సత్యనారాయణ, కోట నీలవేణి పాల్గొన్నారు.

కశింకోట : చంద్రబాబు విజన్ ఏంటో స్కిల్‌డెవలప్‌మెంట్ శిక్షణ పొందిన ఐటీ ఉద్యోగులు అడిగితే తెలుస్తుందని, జైలుకెళ్లొచ్చిన వారికి బాబు గొప్పతనం ఏం తెలుస్తుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని చింతలపాలెం గ్రామంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఐదో రోజు టిడిపి, జనసేన రిలే దీక్షలో పాల్గొన్నారు. పీలా మాట్లాడుతూ, దేశవిదేశాల్లో విజనరీ నేత చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ మద్దతుగా నిరసనలు తెలుపుతుంటే, వైసిపి నేతలు వ్యంగ్యంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రిలేదీక్షల్లో మండల టిడిపి అధ్యక్షుడు కాయల మురళి, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఉగ్గిని రమణమూర్తి, నైనంశెట్టి రమణ రావు, కర్రి దుర్గనాయుడు, పెంటకోట రాము, పంచదార్ల సూరిబాబు, జెర్రిపోతల నూకి నాయుడు, సిదిరెడ్డి సూర్యనారాయణ, జనసేన నాయకులు బుదిరెడ్డి చిన్న, పావాడ కామరాజు, శ్రీరామదాసు గోవిందా, దూలం గోపి, కర్రి గొవింద టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

మునగపాక రూరల్: చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక మెయిన్ రోడ్‌లో టిడిపి రిలేదీక్షల్లో భాగంగా ఆపార్టీ నేతలు మోకాళ్లపై నిలబడి మండుటెండలో నిరసన చేపట్టారు. సైకో పోవాలి, సైకిల్ రావాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీక్షా శిబిరానికి జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం పాల్గొని సంఘీభావాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో భీమరశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట విజయ్, దాడి శివ ,మల్ల వరాహ నరసింహారావు, ఆడారి కన్నబాబు, కాండ్రేగుల పరదేశి నాయుడు, ఆడారి లక్ష్మణరావు, దాడి అప్పలనాయుడు, ఆడారి జానకి, మాలతీ పాల్గొన్నారు.

యలమంచిలి: అర్ధరహితమైన, నిరాధారమైన నిందారోపణలతో చంద్రబాబుపై పులిమిన అక్రమ కేసులు త్వరలోనే వీగిపోతాయని, నిర్దోషిగా బాబు బయటపడతారని టిడిపి నేతలు పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. చంద్రబాబు విడుదలను కాంక్షిస్తూ ఆదివారం స్థానిక బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలు చేశారు.కార్యక్రమంలో ఇత్తంశెట్టి రాజు, గొర్లి నానాజీ, దొడ్డి శ్రీనివాసరావు, రాజాన నారాయణమ్మ, రమణబాబు, శ్రీనివాసరావు, పాస్టర్ జాన్సన్, ఇస్మాయిల్, చిన్నారావు, కరణం రవికుమార్, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం:మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల అయ్యే వరకు శ్రేణులంతా అలుపెరుగని పోరాటం చేయాలని పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని అడ్డురోడ్డు తిమ్మాపురంలో తెదేపా మండల కార్యదర్శి గుర్రం రామకృష్ణ ఇంటి వద్ద బాబుతో మేము సైతం నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వైకాపా నాయకులకు చట్టాలు చుట్టాలుగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా తెదేపా పార్టీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మాజీ డైరెక్టర్ మాజీ ఎంపిపి యేజర్ల వినోద్ రాజు, నాలుగు మండలశాఖల అధ్యక్షులు అమలకంటి అబద్దం, జానకి శ్రీను, కొప్పిశెట్టి వెంకటేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, కోన అప్పలరాజు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న తెలుగుదేశం, జనసేన నాయకులు

ఉక్కు రక్షణ బైక్‌యాత్ర జయప్రదానికి ప్రచారం



అచ్యుతాపురంలో పోస్టర్ల ఆవిష్కరణలో సిపిఎం నేతలు



గాజువాకలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామారావు

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 20 నుండి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో నిర్వహించనున్న ఉక్కు రక్షణ బైక్‌యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో సిపిఎం నాయకులు కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు.

ఈసందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు పరిరక్షణకు పోరాడుతున్న కార్మికులకు సంఘీభావంగా సిపిఎం ఆధ్వర్యంలో బైక్‌యాత్ర జరుగుతోందన్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ, కేంద్రం మెడలు వంచి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునే పోరాటంలో అందరినీ భాగస్వాములను చేసేందుకు బైక్‌యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనకాపల్లిలో సిపిఎం నాయకులు విస్తృత ప్రచారం చేసారు. 20న విశాఖపట్నం లో ప్రారంభమైన బైక్‌యాత్ర, 26న అనకాపల్లి చేరుకుంటుందన్నారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, మండల కమిటీ సభ్యులు ఎం.బాలకృష్ణ, బొప్పే ఉమా మహేశ్వర రావు, కాళ్ళ తెలయ్య బాబు, డి.వై.ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ, సీఐటియు నాయకులు కె. ఈశ్వరరావు, పలకా సత్యనారాయణ పి.చలపతి పాల్గొన్నారు.

అచ్యుతాపురం: ఉక్కు రక్షణ బైక్‌యాత్ర వాల్‌పోస్టర్లను ఆదివారం అరిపాలెం గ్రామంలో సిపిఎం కన్వీనర్ ఆర్ రాము ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా దాదాపు వెయ్యిరోజులుగా కార్మికులు. ఈ ప్రాంత ప్రజలు పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు లేకపోవడం దారుణమన్నారు.

దీన్ని నిరసిస్తూ, కార్మికులకు మద్దతుగా నిర్వహించే బైక్‌యాత్రలో భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎంనేత కే సోమనాయుడు, బిరామ్ కుమార్, కన్ను నాయుడు ,బి రంగారావు, సురేష్ పాల్గొన్నారు.

కె కోటపాడు. : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్తరాంధ్ర బైక్‌యాత్ర వాల్‌పోస్టర్లను ఆదివారం సూరెడ్డిపాలెం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు గండి నాయనబాబు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకొని, సొంతగనులు కేటాయించడం ద్వారా విశాఖ ఉక్కును కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వనం సూర్యనారాయణ, ఎర్ర దేవుడు, బొడ్డు ఆదినారాయణ, డి సత్తిబాబు పాల్గొన్నారు.

గాజువాక : ఈ నెల 20వ తేదీ నుంచి చేపట్టే ఉక్కు రక్షణ యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు ఎన్.రామారావు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పెదగంట్యాడ వాకింగ్ గ్రౌండ్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు మసేనురావు, పిట్ట రెడ్డి, స్టీల్ రిటైర్డ్ ఎంప్లాయీస్ నాయకులు నీలాపు అప్పన్న, సిపిఎం నాయకులు బైరెడ్డి గురప్ప, కొవిరి అప్పలరాజు, జి.శ్రీనివాస్, నమ్మి రమణ, పాల అప్పలరెడ్డి, కొండ శ్రీనివాస్‌రెడ్డి, మొల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు .

'స్కిల్' నిధులు ఏమైపోయాయి? :ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తాము అవినీతికి పాల్పడలేదని జాతీయ మీడియాలో లోకేష్ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ. అవినీతి జరగకపోతే రూ.371 కోట్లు ఎటు వెళ్లాయో చెప్పాలన్నారు. అమరావతి భూములు, ఔటర్ రింగ్‌రోడ్, పోలవరం పనుల్లో జరిగిన అవకతవకలపై దర్యాప్తు జరుగుతుందన్నారు. ఒకప్పుడు టిడిపిని విమర్శించిన పవన్ కల్యాణ్, ప్రస్తుతం ఆ పార్టీని భుజాన ఎత్తుకోవడంలో ఆంతర్యమేమిటో తెలపాలన్నారు. ఎంతమంది కలిసి పోటీ చేసినా వైసిపిని గద్దె దింపడం అసాధ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బొడ్డేటి సూర్యనారాయణ, మండల వైసిపి అధ్యక్షులు దొడ్డి వెంకటరావు, నాయకులు సేనాపతి సత్యారావు, ఒరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు డిపిఎన్ విద్యార్థులు

ప్రజాశక్తి -కశింకోట : ఉమ్మడి జిల్లాల రెజ్లింగ్ పోటీలలోకశింకోట డిపిఎన్ బాలురు హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులు సత్తాచాటారు. కొయ్యూరు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో అండర్ 17 బాలుర విభాగంలో కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులు నవీన్, రమేష్‌కుమార్ బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎంఆర్‌వి. అప్పారావు తెలిపారు. వీరు ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారుఉ విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు వేడుల ప్రభాకరరావు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరసింహనాయుడు



నరసింహనాయుడు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఉమ్మడి విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా అచ్యుతాపురం మండల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంప నరసింహనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖ పట్నం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాల్లోని 20 మండలాల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులుగా పెందుర్తి మండలానికి చెందిన డిఆర్‌జిఎస్ఎస్ఆర్. ప్రభూజీ, ప్రధాన కార్యదర్శిగా నరసింహనాయుడు, కోశాధికారిగా డి.సుబ్బారావు, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలక్షన్ అధికారి వి కోటేశ్వరరావు, ఆంధ్ర రాష్ట్ర బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ .వెంకటరావు, శాప్ డైరెక్టర్ జె .శ్రీనివాసరావు , స్టేట్ అబ్జర్వర్ మురళీ కృష్ణంరాజు, డిఎస్‌డిఏ, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, రాష్ట్ర కోశాధికారి డి. ఆదినారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి .శంకరరావు, సిరికి వెంకటరా పాల్గొన్నారు.

పూడిమడక తీరంలో స్వచ్ఛసాగర్ ర్యాలీ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : స్వచ్ఛసాగర్ సురక్షిత సాగర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పూడిమడక సముద్ర తీరంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పురవీధులలో ర్యాలీ చేశారు. తీరంలో పేరుకున్న చెత్తాచెదారం. వ్యర్థ పదార్థాలను పరిశుభ్ర పరిచి వాహనాల ద్వారా తరలించారు. కార్యక్రమంలో మెరైన్ సిఐ హుస్సేన్, కోఆర్డినేటర్ శ్రీనివాస్, మెరైన్ ఎస్ఐ మల్లేశ్వరరావు, ఉమెన్ ఎస్ఐ స్వీటీ, కోస్టల్ సలహాబోర్డు సభ్యులు చేపల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న అధికారులు, స్థానికులు

శాంతియుత నిరసనల అణచివేత దుర్మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : టిడిపి అధ్యక్షులు చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో అఖిలపక్షాలు చేపట్టిన శాంతియుత ప్రదర్శనలపై పోలీసుల అణిచివేత ధోరణిని అఖిలపక్షాలు తప్పుపట్టాయి. దీనిని నిరసిస్తూ ఆదివారం అనకాపల్లి సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగినది. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు బాలకృష్ణ, గంట శ్రీరామ్, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం కార్యదర్శి బొలిశెట్టి శ్రీనివాసరావు, బిఎస్‌పి నాయకులు సూది కొండ మాణిక్యాలరావు మాట్లాడుతూ 45సంవత్సరాలకు పైగా సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన చంద్రబాబు పట్ల ప్రభుత్వం, పోలీసులు అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ప్రభుత్వం అన్యాయంగా అక్రమంగా అడ్డదారిలో, అరెస్టు చేయడం చాలా బాధాకరమన్నారు. ఈ అక్రమ అరెస్టును ఖండిస్తూ శాంతియుత నిరసనలు జరగకుండా, ఎక్కడికక్కడే, నిర్బంధాలు అరెస్టులు చేయడం తగదన్నారు. చంద్రబాబు అరెస్టు రాష్ట్ర ప్రజలు, దేశప్రజలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా, అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారని మండిపడ్డారు. దీనికి తగిన మూల్యం వైసిపి ప్రభుత్వం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పిఎఫ్, ఎపిజిఎల్ఐ నిధుల దారి మళ్లింపు సిగ్గుచేటు



మాట్లాడుతున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆరు నెలలుగా ఉపాధ్యాయులకు పిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడం సిగ్గుచేటని యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ విమర్శించారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమావేశానికి అధ్యక్షత వహించిన చిన్నబ్బాయి మాట్లాడుతూ పిఎఫ్, ఎపిజిఎల్ఐ ఖాతాలన్నీ ఉద్యోగుల వ్యక్తిగత పిడి అకౌంటులని, వాటి నుంచి ఆయా ఉద్యోగుల అనుమతి లేకుండా నిధులు డ్రా చేసే అధికారం ప్రభుత్వానికి కూడా లేదన్నారు. అయినా ప్రభుత్వం ఆరు నెలలుగా ఉద్యోగులు దాచుకొన్న నిధులను దారి మళ్లించి తన సొంత పనులకు వాడుకోవడం అన్యాయమన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు తాము దాచుకున్న ఈ సొమ్ము అకౌంటుల నుంచి రుణ రూపంగాను, ఫైనల్ పేమెంట్ రూపంలోను డ్రా చేసుకొనే అవకాశం ఉండగా, ఆరు నెలలుగా ఆ బిల్లులు చెల్లించక పోవడం దారుణమన్నారు. తక్షణమే పిఎఫ్‌సెపిజిఎల్ఐ పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుల రెండు నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వి. శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు గాయత్రి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు ఎస్. శేషు కుమార్, పొలిమేర చంద్ర రావు, సీనియర్ నాయకులు దేముళ్ల నాయుడు, వెంకటప్పారావు, చౌదరి భాస్కరరావు పాల్గొన్నారు.

గణేష మండప ఏర్పాటుకు వితరణ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని బంగారయ్య పేట గ్రామంలో వినాయక విగ్రహానికి నెలకొల్పడానికి తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆర్థికసాయం అందించారు. తన సొంత నిధులు రూ.లక్ష 50 వేలను ఉత్సవ కమిటీకి అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావును ఉత్సవ కమిటీ సభ్యులు అభినందించి, సత్కరించారు

20న జనసేన ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- సబ్బవరం: ఈనెల 20న సబ్బవరం మండల జనసేన పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ 88వ వార్డు, నంగినారపాడు అజనగిరి సీనియర్ నాయకులు ఇందల వెంకటరమణ తెలిపారు. మండల సీనియర్ జనసేన నేత గండి దుర్గాప్రసాద్ సూచనల మేరకు ఇరువాడ దరి జిఎస్ కల్యాణ మండపంలో ఈ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేపంచకర్ల రమేష్ బాబును సత్కరిస్తామన్నారు సీనియర్ నాయకులు అడ్వకేట్ బలిరెడ్డి అప్పారావు, నేతలు బోదువలస ఎంపిటిసి ఉగ్గిన లక్ష్మీ రాము ,కంచిపాటి రాంబాబు , దాసరి అచ్చిబాబు, బొడ్డపల్లి సూరి దేముడు,బొలెం శ్రీనివాసరావు, బండారు శ్రీను, మామిడి సతీష్ ,గొర్లి అప్పలనాయుడు, దాసరి నాయుడు పాల్గొన్నారు

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం



పతాక ఆవిష్కరణ చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి- చోడవరం : విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సమైక్య పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా జిల్లా అధ్యక్షులు మామిడి రమణ అన్నారు. ఆదివారం చోడవరం వాకర్స్ క్లబ్ వద్ద జిల్లా ప్లీనరీ సమావేశాలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పతాకాన్ని రమణ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులంతా అధ్యయనం పోరాటం అనే నినాదాలు చేశారు.. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలపై విపరీతమైన ఫీజుల భారం పడుతుందన్నారు. విద్య ప్రయివేటీకరణకు ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని, ప్రభుత్వ హాస్టళ్లను నిర్వీర్యం చేసి, పేదలకు విద్యను దూరం చేసే విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. విద్యార్థులు సమైక్యంగా పోరాటం జరిపితే తప్ప భవిష్యత్తులో విద్య పేదలకు అందుబాటులో ఉండదన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఎన్నిక

అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించగా, అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్ రమణ, ఎం రమణ ఎన్నిక కాగా, మురళి జి. తరుణ్, కోశాధికారిగా, గర్ల్స్ కన్వీనర్‌గా నీరజ, బాలాజీ ,శ్రీను, సహాయ కార్యదర్శిగా సుందర్, గీతాకృష్ణ ఎన్నికయ్యారు. శ్రావణి, కేశవ, ప్రసాద్, చిట్టి, జ్యోతి, చిన్న లను ఎన్నుకున్నారు

ప్రమాదభరిత కల్వర్టును పట్టించుకోరా?

సిపిఎం ఆధ్వర్యంలో వెంకన్నపాలెం బ్రిడ్జి వద్ద రాస్తారోకో



కల్వర్టు దగ్గర రాస్తారోకో నిర్వహిస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి- చోడవరం: చోడవరం రోడ్డులో వెంకన్నపాలెం వద్ద శిథిలమై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు వెంటనే పునర్నిర్మాణం, రక్షణగోడలను ఏర్పాటు చేయాలని సిపిఎం చోడవరం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వెంకన్నపాలెం కల్వర్టు వద్ద రాస్తారోకో చేపట్టారు. కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఎరుపు రంగు చీరలను కట్టారు. ప్రమాదసూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన కల్వర్టులను, రోడ్డులను బాగుచేయలేని పరిస్థితులల్లో ప్రభుత్వం, అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఉన్నారన్నారు. దీనిపై ఎన్నోసార్లు విన్నవించినా కనీసం పట్టించుకో లేదన్నారు. అన్నీ అభివృద్ధి చేస్తున్నామనిఊదరగొడుతున్న అధికార పక్ష నేతలకు కనీసం రోడ్లు, కల్వర్టు నిర్మించలేక పోతున్నామన్న ఇంగితజ్ఞానం లేకపోవడం శోచనీయమన్నారు. దీనిపై కలెక్టర్, ఆర్అండ్‌బి అధికారులకు విన్నవించడం తోపాటు పలుమార్లు సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అనకాపల్లి, అల్లూరి, విశాఖ జిల్లాలకు ప్రధాన రహదారిగా ఉన్న ఈ మార్గంలో రోజూ వేలాదిమంది ప్రయాణిస్తున్నా రన్నారు. కల్వర్టులు రక్షణ గోడలు కూలి, బ్రిడ్జి కూలిపోయే స్థితిలో ఉన్నా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదు. గడపగడపలో సమస్యలన్నీ పరిష్కరిస్తామంటున్న ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తున్నా, ప్రమాదభరిత కల్వర్టు కనిపించడం లేదాయని ప్రశ్నించారు. ఏదైనా ప్రమాదం జరిగితే గానీ పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎస్ వి నాయుడు, జోగా రాము, ఐత కోటి, గండి శ్రీను, జి హరి, పి సత్తిబాబు రాజు, లక్ష్మణ పాల్గొన్నారు.

రెవెన్యూ మంత్రి వ్యాఖ్యలు ప్రమాదకరం

- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి- అనకాపల్లి :ఉపాధ్యాయ సంఘాలు ప్రమాదకరమన్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి పాఠశాలలను బాగుచేశారని, కానీ తమ దృష్టిలో బాగు చేయడమంటే బడికి రంగులు వేయించడం కాదు, బడిలో ఖాళీగా ఉన్న పోస్టులు నింపడమన్నారు. బాగు చేయడమంటే డిజిటల్ సౌకర్యాలు కల్పించడం మాత్రమే కాదు, ఉపాధ్యాయులను స్వేచ్ఛగా పాఠాలు చెప్పుకొనే పరిస్థితి కల్పించాలన్నారు. బోధనేతర పనుల నుంచి తప్పించాలన్నారు. 117 జిఒ తెచ్చి పాఠశాలలను ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. ఇలాంటివన్నీ అడిగితే మంత్రికి ఉపాధ్యాయ సంఘాలు ప్రమాదకరంగానే కనిపిస్తాయని, మంత్రి ఈ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ సుంకర లక్ష్మి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు సాగుతున్నాయి. మెయిన్ రోడ్డు, తహశీల్దార్ కార్యాలయం రోడ్డు బీసీ కాలనీ గాడి వారి వీధి, సుంకర వారి వీధి తదితర గ్రామ ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు, డోజర్లతో శుభ్రపరుస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి రెడ్డి, గ్రామ పెద్దలు వార్డు సభ్యుడు సుంకర శ్రీను, మేడసెట్టి అప్పారావు, వియ్యపు రామారావు పాల్గొన్నారు

ఘనంగా ముగిసిన వైశాఖి నృత్యోత్సవం


కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు


ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యాన కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న మూడు రోజుల వైశాఖి నృత్యోత్సవం ఆదివారంతో ముగిసింది. సాయంత్రం వేళ ఆంధ్ర నాట్యం, మయూర్ భంజ్ ఛౌ, మోహినీయాట్టం, ఛండాలిక కరాచిపూడి నృత్య నాటిక ప్రదర్శనలు దేనికవే తన విశిష్ఠత చాటుకున్నాయి. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకులు బత్తిన రంగ విక్రమ్ కుమార్ (గౌడ్) నిర్దేశకత్వంలో ఆద్యంతం ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసిన ఈ ఉత్సవ ప్రదర్శనలు రాత్రితో ముగిశాయి. మూడోరోజు ప్రదర్శనకు అతిథులు అనకాపల్లి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కెవి.మురళీకృష్ణ, అంతర్జాతీయ స్థాయి లైటింగ్ డిజైనర్ సాయి వెంకటేష్ (కర్ణాటక), జాతీయ నృత్యోత్సవ సంచాలకులు జగబంధు జెనా (ఒడిషా), రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణ మూర్తి ప్రభృతులు హాజరై జ్యోతి వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. కళాకారులను సత్కరించారు

జీవాల పెంపకందారులకు రుణాలివ్వాలి

గొర్రెలు, మేకల పెంపకందార్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్


తేగాడ సమావేశం లో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

ప్రజాశక్తి- కశింకోట : గొర్రెలు మేకల పెంపకందారులకు రుణాలు ఇవ్వాలని, పశువైద్యం ఉచితంగా అందించాలని ఆంధ్ర ప్రదేశ్ గొర్రెలు మేకలు పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తేగాడలో పెంపకందారుల సంఘం అధ్వర్యంలో సర్వశుద్ధి తాతారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గొర్రెలు మేకలు పెంపకందారులకు 559, 1016 జిఒల ప్రకారం మేత, రాత్రి పూట బసలకు స్థలం కేటాయించాలని, ఎన్ఆర్ఇజిఎస్ పథకం ద్వారా షెడ్లు నిర్మాణం చేయాలనిడిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత గొర్రెల మేకలు పంపకందారులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. జీవాలకు మందులు లేకపోవడం వల్ల వేలాది జీవాలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే పశు నష్ట పరిహారం పేరుతో ఎటువంటి ప్రీమియం కట్టకుండానే గొర్రెలు మేకలు మృతిచెందితే ఒక్కోదానికి రూ.6000 చెల్లించే పథకాన్ని ఎత్తివేసిందన్నారు. దాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. నట్టల నివారణ మందులు సంవత్సరానికి నాలుగు సార్లు ఇవ్వాలని, అవసరమైన అన్ని వ్యాక్సిన్స్ ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తరహాలో పెంపకందారులకు గొర్రెలు మేకలను పంపిణీ చేస్తానని పాదయాత్రలో హామనిచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత మొండిచేయి చూపారన్నారు. గొర్రెలు మేకలు అభివృద్ధి సహకార ఫెడరేషన్ నిధులు రూ. 88 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించండం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దాకారపు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ సర్వశుద్ధి తాతారావు, పల్లా వెంకయ్య నాయుడు, చందక నాగేశ్వరరావు, కుండలు శ్రీను, పక్కుర్తి వెంకట అప్పారావు, కుండలు బాబురావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గెడ్డ కబ్జా

రూ.6.72 కోట్లు విలువైన వాగు అన్యాక్రాంతం

కార్యాలయం నిర్మించి, దర్జాగా వ్యాపారం

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


గెడ్డ స్థలంలో నిర్మించిన నిర్మాణం

ప్రజాశక్తి -పరవాడ: ప్రస్తుతం మండలంలోని కబ్జాదారుల చేతిలో గెడ్డ వాగులు చిక్కుకున్నాయి. వాటిని కాపాడాల్సిన రెవిన్యూ అధికారులు కాసులు తీసుకోని అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారు. మండలంలో కబ్జాదారులకు ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోవడంతో గెడ్డవాగులను ఎంచుకొని కబ్జాలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రం పరవాడ రెవెన్యూ గాజువాక, ఎలమంచిలి ప్రధాన రోడ్డు ఆనుకొని సర్వే నెంబరు 236 గెడ్డ వాగు సుమారు 70 సెంట్లు స్థలాన్ని పూడ్చి అక్రమంగా షెడ్డు నిర్మించారు. గెడ్డ వాగు ఒక మూలన బోరుబావి నిర్మాణం, మరోపక్క వరిగడ్డి టాక్టర్ల పార్కింగ్ యార్డుగా వ్యాపార కలాపాలు జరుపుతున్నారు. దీనికి స్థానిక వైసీపీ నాయకుడుకు సుమారుగా రూ.5 లక్షలు ముట్టచెప్పినట్లు అందుకే సర్వే నెం.236 గెడ్డ వాగు ఆక్రమించిన స్థలానికి అందులో ఉన్న అక్రమ నిర్మాణంకు అధికార పార్టీ నాయకులు అండదండలు పుష్కలంగా ఉన్నాయని స్థానికుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి.

గెడ్డ వాగు స్థలంలో వ్యాపారంతో లక్షలాది రూపాయలు వెనకేస్తున్నారు. బోరుబావి నీటిని పక్కనే ఉన్న కోకోకోలా కూల్ డ్రింక్ గోడౌన్‌కు నీటిని సంవత్సరానికి లీజుకు ఇచ్చి, షెడ్డును ట్రాన్స్‌పోర్ట్ కంపెనీకి అద్దెకు ఇచ్చి, మరోపక్క వరిగడ్డి ట్రాక్టర్లు పార్కింగ్ రోజుకు ఒక టాక్టర్‌కు రూ. 200 పార్కింగ్ కోసం వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ 70 సెంట్ల గెడ్డ వాగు స్థలం మార్కెట్లో రూ.6.72 కోట్లు పలుకుతుంది. రెవెన్యూ అధికారులకు స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన చూసి వెళ్ళిపోతున్నారు తప్ప చర్యలు తీసుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా గెడ్డవాగును ఆక్రమించి, అక్రమ వ్యాపారాలు చేస్తూన్న వారిపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోని, గెడ్డవాగులో వేసిన బోరుబావిను, అందులో నిర్మించిన భవనాన్ని తొలగించి, గెడ్డ వాగు భూమిను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గెడ్డవాగు కబ్జాపై తహసీల్దార్ పి కనకారావును ప్రజాశక్తి వివరకు ప్రయత్నించగా, అందుబాటులో లేరు. డిప్యూటీ తాసిల్దార్ శాంతి భూషణరావును వివరణ కోరగా గెడ్డవాగు కబ్జా జరిగినట్లు తమ దృష్టికి రాలేదని తెలిపారు.

బొజ్జన్న కొండ అభివృద్ధి డిజైన్ల పరిశీలన


డిజైన్లపై అధికారులకు సూచనలిస్తున్న ఎంపీ సత్యవతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 24న రూ.7.5 కోట్లతో ప్రారంభించనున్న కానున్న బొజ్జన్న కొండ నిర్మాణ పనుల డిజైన్లను అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి ఆదివారం అధికారులతో కలిసి పరిశీలించారు. పర్యాటకులకు అనుకూలంగా డిజైన్లలో కొన్ని మార్పులను సూచించారు. ఈ కార్యక్రమంలో శంకరం గ్రామ సర్పంచ్ పసుపులేటి లక్ష్మీ రామకష్ణ, అధికారులు పాల్గొన్నారు.

సందడిగా ఆడారి కుటుంబీకుల వనభోజనం



వనభోజనంలో సందడిగా గడుపుతున్న సన్యాసినాయుడు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో స్వర్గీయ ఆడారి సన్యాసినాయుడు కుటుంబ సభ్యుల వనభోజనం ఆదివారం సందడిగా గడిచింది. ఈ సందర్భంగా పలువురు పెద్దలకు సత్కారాలు చేశారు. దానిలో భాగంగా సిఎ పూర్తి చేసుకుని హైదరాబాదులో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన గ్రామానికి చెందిన ఆడారి వెంకటరావు (సిఐడి డిపార్ట్మెంట్) కుమార్తె భావనను, అదేవిధంగా ఎన్నో సాంఘిక, పౌరాణిక నాటికలను రచించిన యువ రచయిత శేఖర్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం మహిళలకు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

బ్రాహ్మిణి మాటలతో

వైసిపి నేతల్లో భయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నారా బ్రహ్మణి ఇటీవల చేసిన వ్యాఖ్యలతో వైసిపి నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం సాయంత్రం టిడిపి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఇంటర్ ఫెయిల్ అయిన రోజా స్టాన్ఫోర్డ్‌లో చదివిన బ్రహ్మణి మీద విమర్శలు చేయడం ప్రజలు సహించలేక పోతున్నారన్నారు.

చివరికి నిరాశే...

-సాగని వరి సాగు
- ఎండుతున్న వరి నాట్లు - రక్షించే పనిలో అన్నదాత



గొడిచెర్ల వద్ద నాట్లు పడక ఖాళీగా ఉన్న వరి పొలాలు

ప్రజాశక్తి-నక్కపల్లి: ఖరీఫ్‌లో నెలకొన్న వర్షా భావంతో సాగుపై కరువు దెబ్బపడింది. వర్షాలు ముఖం చాటేయడంతో ఎక్కడ చూసినా కరువు తాండవిస్తుంది. అన్నదాత నానా కష్టాలు పడి ఉడిసిన వరి పొలాలు ఎండిపోతున్నాయి. వర్షాలు సక్రమంగా కురువక పోడంతో అదునుదాటి పోయినప్పటికీ రైతులు ఇంకా ఆశతో వరి నాట్లు వేస్తూనే ఉన్నారు. ఈ సమయానికి పచ్చగా కళకళలాడుతూ కనిపించాల్సిన వరి పొలాలు బీటలు వారి ఖాళీగా దర్శినమి స్తున్నాయి.

మండలంలో వరి సాధారణ సాగు 5125 ఎకరాలకు గాను, ఇప్పటికి సుమారుగా 1250 ఎకరాల్లో మాత్రమే రైతులు ఉడుపులు వేసారు. ఇంకా 3875 ఎకరాల్లో నాట్లు పడాల్సివుంది. కానీ వర్షాలు పడక పోవడంతో ఉడుపులు సాగలేదు. ఆగష్టు 14 నాటికి 350 ఎకరాల్లో వరి నాట్లు వేయగా, ఆగష్టు చివరి వారంలో అడపా దడపా కురిసిన వర్షాలకు నేటికి మరో 900 ఎకరాల్లో రైతులు ఎంతో శ్రమించి ఉడుపులు వేసారు. వర్షాలు పడక పోవడంతో చాలా చోట్ల ఆకు ముదురు పోయింది. అయినప్పటికీ రైతులు వరి నాట్లు వేసారు. కొన్ని ప్రాంతాల్లో వరి ఆకు ఎండిపోవడంతో, ఆకు లేక మరో చోట కొనుగోలు చేసి మరీ ఉడ్చారు. దీంతో, రైతన్న అదనంగా పెట్టుబడి పెట్టాల్సివచ్చింది. ప్రస్తుతం వర్షాలు పడకపోవంతో ఉడిచిన వరి నాట్లు ఎండిపోతున్నాయి. బావులు, బోరులు సదుపాయం వున్న చోట రైతులు వరిని రక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. అయినప్పటికి సాగునీరు సరిపోవక పోవడంతో వరి నాట్లు ఎండుతున్నాయి.

నామమాత్రంగానే ఉడుపులు

గత ఏడాది వర్షాలు సమృద్ధిగా పడటంతో పూర్తిస్థాయిలో వరి సాగైంది. ఇప్పుడు ఆ పరిస్థితి కనుచూపుమేరెక్కడా కనిపించలేదు. మండలంలో 32 శాతం వర్షపాతం లోటు ఉంది. దీని కారణంగా 30 శాతం మాత్రమే వరినాట్లు పడ్డాయి. మండలంలో గొడిచెర్ల రెవెన్యూలో అత్యధికంగా 950 ఎకరాల్లో వరినాట్లు పడాల్సి వుండగా 75 ఎకరాల్లో మాత్రమే ఉడుపులు సాగాయి. చినదొడ్డిగల్లు లో 450 ఎకరాలకు గాను 82 ఎకరాలు, కాగిత 420 ఎకరాలకు గాను 120 ఎకరాలు, గుల్లిపాడు 355 ఎకరాలకు గాను 50 ఎకరాలు, జి.జగన్నాధపురంలో 330 ఎకరాలకు గాను 85 ఎకరాలు, వేంపాడు లో289 ఎకరాలకు గాను 34 ఎకరాలు, దేవవరంలో 225 ఎకరాలకు గాను 75 ఎకరాలు, ఉపమాక ఆగ్రహారంలో 220 ఎకరాలకు గాను 42 ఎకరాలు, చినరామభద్రపురంలో 198 ఎకరాలకు గాను 65 ఎకరాలు, గునుపూడి 186 ఎకరాలకు గాను 132 ఎకరాలు, ఉద్దండపురంలో 173 ఎకరాలకు గాను 26 ఎకరాలు, డొంకాడ 160 ఎకరాలకు గాను 40 ఎకరాలు, పెదదొడ్డిగల్లులో 150 ఎకరాలకు గాను 78 ఎకరాలు, ముకుందరాజుపేటలో 120 ఎకరాలకు గాను 120 ఎకరాలు, ఎన్. నర్సాపురంలో 85 ఎకరాలకు గాను 4 ఎకరాలు, రమణయ్యపేటలో 55 ఎకరాలకు 47 ఎకరాలు, నక్కపల్లి 53 ఎకరాలకు 15 ఎకరాలు, చీడిక 40 ఎకరాలకు 40 ఎకరాలు,దోసలపాడు 40 ఎకరాలకు 40 ఎకరాలు, రేభాక 43 ఎకరాలకు గాను 29 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి.ఇదీ కూడా రైతులు ఎంతో శ్రమించి నాట్లు వేసారు.ఆకులు తడుపుకుని, ఆకులు ఎండిపోయిన చోట మరో చోట కొనుగోలు చేసుకుని , మోటార్లతో నీరు పెట్టుకుని, దమ్ములు చేసి,అదనంగా కూలీలను పెట్టుకుని ఉడుపులు వేసారు.ఉడిచిన ప్రతీ చోట రైతులు అదనంగా పెట్టుబడులు పెట్టారు. కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి కనిపిస్తుంది.

ఎపి వ్యకాస నేతలు పరిశీలన

ఇప్పటికే ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎండిపోతున్న వరి పొలాలను పరిశీలించడం జరిగింది. రైతులు తమ కష్టాని, ఆవేదనను నేతలు వద్ద వెళ్ళగక్కారు. అధిక పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తపరిచారు. వ్యవసాయ అధికారులు ఎండుతున్న వరి పొలాలను పరిశీలించారు.

వరి నాట్లు ఎండుతున్నాయి

వర్షాలు సక్రమంగా పడకపోవడంతో వరి నాట్లు ఎండుతున్నాయి.ఎకరం పొలం ఉండగా, మరో ఎకరం కౌలుకు తీసుకుని వరి నాట్లు వేసాను.ప్రస్తుతానికి 30 వేల రూపాయులు పెట్టుబడి పెట్టాను.ఎండలు మండు తున్నాయి. వరి ఎండి పోతుంది. పెట్టుబడి పోయినట్టే



రాము, రైతు, మామిడివానిపాలెం

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో అనకాపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి.జిల్లాలో 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబందించి 2.04 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు నమోదుకావల్సివుండగా నేటికి 1.13 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు నమోదయ్యాయని, దీనిలో ప్రధానంగా వరి సాగు 1.36 లక్షల ఎకరాలకు గాను 91.777 ఎకరాల్లో వరి సాగైంది.



**ఎం.అప్పలరాజు,
ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి**

వరి ఆకు కొనుగోలు చేసి ఉడిచాం

రెండు ఎకరాల పొలంలో వరి నాట్లు వేసేందుకు వరి ఆకును వేసాను.వర్షాలు లేక వరి ఆకు ఎండిపోయింది.మరో చోట వరి ఆకు కొనుగోలుచేసి ఇటివల అడపా దడపా కురిసిన వర్షాలకు రెండు ఎకరాల్లోనూ వరి ఉడిచాను. వరి ఆకు కొనుగోలు చేసినందుకు, కూలీలకు, ట్రావిలింగ్ ఖర్చులు, దమ్ముకు, ఉడిచినందుకు కూలీలకు కలిపి 32 వేలు ప్రస్తు తానికి పెట్టుబడి అయ్యింది.



**కొల్లాటి సూరిబాబు,
రైతు , ఉపమాక**

80 శాతం రాయితీపై విత్తనాలు

రైతులు ప్రత్యామ్నాయ పంటలను పండించుకోవాలి. వర్షాభావ పరిస్థిల ప్రభావం కారణంగా నీరు లేక వరి నారు ఎండిపోయినా, ఉడుపులు వేసుకోలేక పోయినా ప్రభుత్వ నిబంధనలు మేరకు ఆయా రైతులు జాబితాని గుర్తిస్తాం. ప్రత్యామ్నాయ పంటలకు సంబందించిన విత్త నాలు వరి, రాగులు, అపరాలు 80 శాతం రాయితీపై అందజేస్తాం.



**ఉమా ప్రసాద్,
మండల వ్యవసాయాధికారి**

గర్జన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక కృష్ణా ప్యాలెస్ లో గర్జన పోస్టర్ ను డి.ఎస్.పి (దళిత సేవా పరిరక్షణ) జిల్లా అధ్యక్షులు యాదగిరి దాసు, డీకే ఎస్ ఎస్ (దళిత కులాల సంక్షేమ సేవా సంఘం) జిల్లా అధ్యక్షులు చిట్ల చలపతి ఆధ్వర్యంలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దళిత ప్రతినిధులు మాట్లాడుతూ, దళితులు రాజకీయ పార్టీల పోరాటాల్లో సమిధలుగా మారడాన్ని వారు వ్యతిరేకించారు. తమ హక్కుల్ని కోల్పోతున్నా కలిసి ఉండకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లవరపు సతీష్, కోడి నాగరాజు, మంగళగిరి మౌళి, మంగళగిరి నాగేంద్ర కుమార్, పెదబొడ్డేపల్లి నుంచి నగేష్, రమ్య పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: జర్నలిస్టులకు అండగా జగన్ ప్రభుత్వం ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హామీ ఇచ్చారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్) సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు స్థలము, భవన నిర్మాణానికి అవసరమైన నిధులను ఎంపీ ద్వారా మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటివరకు ఇంటి స్థలం పొందని విలేకరులకు తొందరలోనే పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. జాప్ రాష్ట్ర అధ్యక్షులు పున్నంరాజు మాట్లాడుతూ, ఇప్పటికే సమాచార ప్రచారశాఖ కమిషనర్‌కు సమస్యలపై వినతపత్రం అందించామన్నారు.ఆర్డీవో జయరాం మాట్లాడుతూ విలేకరులకు ఇళ్ల స్థలాలతో పాటు ప్రెస్ క్లబ్ కి అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుగంధర్ రెడ్డి మాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎలమంచిలి వేణు, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, ప్రెస్ క్లబ్ అద్యక్షుడు పులిగా మురళి, ప్రధాన కార్యదర్సి శివకుమార్, కోశాదికారి డి.వి.రమణ, గౌరవ అధ్యక్షుడు గొర్లి రాజు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యకుడు రాజశేఖర్, కార్యదర్సి జెట్టి శంకర్, గౌరవ అధ్యక్షుడు స్వామి నాయుడు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు వేళాయె..

- గ్రామాల్లో నేటి నుంచి ప్రారంభం



నర్సీపట్నంలో సిద్ధమైన వినాయక విగ్రహాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: పట్టణంలో వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. రెండు ఫీట్ల ఎత్తు వినాయకుడి నుంచి మొదలుకొని తొమ్మిది ఫీట్ల ఎత్తు లంబోదరుడి వరకు విగ్రహాలను పట్టణ పరిధిలో పెదబొడ్డేపల్లి, రోలుగుంట, కొత్తకోట తదితర ప్రాంతాల్లో తయారు చేస్తున్నారు. అలాగే ఆర్డర్ల ద్వారా విగ్రహాలను తయారు చేయించుకునే వారు కొన్ని రోజుల ముందే కొంత నగదు అడ్వాన్స్ ఇచ్చి తమకు నచ్చే ఆకృతిలో విగ్రహాలను తయారు చేయించుకున్నారు. ఈ నెల 18న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వినాయక ఉత్సవ కమిటీలు విగ్రహాల తయారీ విషయంలో జాగ్రత్తలు తీసుకున్నారు. వెంకునాయుడు పేటలో మట్టి గణపతిని తయారు చేశారు. వినాయక నవరాత్రులను పురస్కరించుకొని మండపాలు రూపుదిద్దుకుంటున్నాయి. మండపాల చవితి పందిళ్ల ఏర్పాటు పలుచోట్ల సిద్ధం చేసే పనుల్లోనూ చందాలు వసూళ్ల చేసే పనుల్లోనూ యువకులు, ఉత్సవ కమిటీలు నిమగ్న మయ్యాయి. పెద్ద పెద్ద విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేసేందుకు ఆర్డర్లు ఇచ్చి వాటిని తరలిస్తున్నారు. ఈ ఏడాది విభిన్న రూపాల్లో గణనాథుడు భక్తులను అలరించేలా ఉత్సవ కమిటీలు విగ్రహాలను సిద్ధం చేశారు. శివలింగంతో వినాయకుడు, పంచ ముఖ వినాయకుడు, లక్ష్మీదేవితో గణపతి, సింహ వాహనంపై బొజ్జ గణపతి, మూడు ముఖాలు, వెంకటేశ్వర స్వామిని పోలిన గణపతి ఎనిమిది చేతులతో గోవింద గణపతి, వరసిద్ధి వినాయకుడు ఇలా పది రూపాల్లో వినాయక విగ్రహాలు పట్టణంలో సిద్ధమయ్యాయి,

యలమంచిలి రూరల్.: పేద,ధనిక చిన్న, పెద్ద అనే బేదాభిప్రాయాలు లేకుండా అందరూ ఎంతో ఆనందంగా జరుపుకునే వినాయక చవితి అంతా సిద్ధమైంది. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వీధిలో వివిధ రకాల అలంకరణలతో వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. 20వ వార్డు పెదపల్లిలో జయ గణేషుని ఆలయానిన పూల, విద్యుద్దీప అలంకరణలతో ముస్తాబు చేశారు. మాలాధారణ చేసిన స్వాములకు ఆలయ ప్రాంగణంలోనే మధ్యాహ్న భోజనం, అల్పాహారాన్ని అదే గ్రామానికి చెందిన బొద్దపుకృష్ణ మణి దంపతులు ఏటా మాదిరిగా ఆనవాయితీగా అందించేందుకు రూ.మూడు లక్షల వరకు ఖర్చు చేస్తారని గ్రామస్తులు తెలిపారు.

కశింకోట: కశింకోట మండలంలో వినాయక చవితి సందడి నెలకొంది. తాళ్ళపాలెం జంక్షన్ లో వినాయక విగ్రహాలు అమ్మకానికి పెట్టినా, కొనుగోళ్లు తగ్గాయి. మట్టి విగ్రహాల ఏర్పాటుపై విస్తృత ప్రచారం, ఉచిత పంపిణీలు జరుగుతున్నా, కొంతమంది ఆకర్షణీయంగా ఉన్న రంగుల విగ్రహాల కొనుగోలుకు మొగ్గుచూపారు.కశింకోట, తాళ్ళపాలెం జంక్షన్, నరిశింగబిల్లి, కన్నూరుపాలెం గ్రామంలో విగ్రహాలను అమ్ముతున్నారు.



విద్యుత్ సెట్టింగ్



కావడి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ఆదివారం స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్య ఆధ్వర్యంలో ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభ సూచికగా మాఢవీధులలో కావడి ఊరేగింపు ఉత్సవం జరిగింది. భక్తులు పసుపు, కుంకుమలు, కొబ్బరి బొండాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు మాట్లాడుతూ, దాతలు, భక్తుల భాగస్వామ్యంతో ఈనెల 26వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. 18 సోమవారం ధ్వజారోహణం, 23న వసంతోత్సవం, 25న మృగవేట, ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయన్నారు. 26న పూర్ణాహుతి, వినోదోత్సవం, కంకణ విసర్జన, చూర్ణోత్సం వంటి పూజ కార్యక్రమాలు జరుగుతాయని , ఉత్సవాల్లో భాగంగా పగలు ,రాత్రి సమయాలలో స్వామివారి తిరువీధి సేవలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, నండూరి రాజ గోపాలాచార్యులు, ఉపాధ్యాయులు దవరసింగి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్సిల్ ముల్లుపై గణపయ్య

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత, సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేష్ పెన్సిల్ ముల్లు పై బొజ్జ గణపయ్య ప్రతిరూపాన్ని ఆవిష్కరించాడు. సోమవారం వినాయక చవితి సందర్భంగా తన సూక్ష్మ కళ నైపుణ్యంతో పెన్సిల్ ముల్లుపై గణపతిని చెక్కి తన భక్తిని చాటుకున్నాడు. అదే గ్రామానికి చెందిన మరో సూక్ష్మ కళాకారుడు దార్ల రవి చెక్కపై గణపతిని చెక్కాడు.




గణపతి ప్రతిరూపం

శిక్షణ పేరుతో చంద్రబాబు దోపిడీ

- ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: యువతకు శిక్షణ పేరుతో 371 కోట్లు రూపాయలను చంద్రబాబు నాయుడు దోచుకున్నారని స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విమర్శించారు. ఆదివారం విలేకరులకు పంపిన వీడియోలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు అనేక స్కాములు చేశాడని అందులో అతి చిన్న స్కాము స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ మాత్రమేనని తెలిపారు. భవిష్యత్తులో చంద్రబాబు దోచిన , చేసిన ప్రతి స్కాం బయట పెట్టడం జరుగుతుందన్నారు.ప్రజల సొమ్ము దోచుకున్న దొంగను అరెస్ట్ చేస్తే అయ్యన్నపాత్రుడు ఇక్కడ నిరసనలు చేస్తున్నారని నువ్వు అన్యాయం చేయకపోతే ఇతర ప్రాంతాల నుండి ఎందుకు లాయర్ని తీసుకొచ్చావని ప్రశ్నించారు. ఎన్టీఆర్ భక్తులమని చెప్పుకునే అయ్యన్నపాత్రుడు చంద్రబాబు ఎన్టీఆర్కు వెన్నుపోటు పొడిచారని తెలిపారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం కి మెడికల్ కాలేజీ ఇచ్చారని కొనియాడారు.. 2014లో అధికారం పొంది రైతు రుణమాఫీ చేస్తానని రైతులను చంద్రబాబు మోసం చేసారని, డ్వాక్రా రుణమాఫీ చేస్తానని డ్వాక్రా మహిళలను మోసం చేసాన్నారు. ఇలా అన్ని వర్గాలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబునాయుడుదే నని అన్నారు.



ఆదర్శనీయుడు.. కృష్ణారావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తన ఉద్యోగ ప్రస్థానంతోనూ, రిటైర్ అయిన తరువాత సమాజ వికాసానికి చేపట్టిన కార్యక్రమాలతోనూ, తుదకు చనిపోయిన తరువాత తన పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాల విద్యార్థుల పరిశోధన కోసం అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయంతోనూ అందరికీ ఆదర్శనీయునిగా యలమంచిలి కృష్ణారావు నిలిచారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐటిఐ జాయింట్ డైరెక్టర్ వై.కృష్ణారావు ఉద్యోగ విరమణ చేసి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆత్మీయ కలయిక పేరిట ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షులుగా విశ్రాంత ఐటిఐ ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు వ్యవహరించారు. అతిథిగా హాజరైన లోకనాథం మాట్లాడుతూ కృష్ణారావు తన ఉద్యోగ కాలంలో నిజాయితీగా, నిఖార్సుగా పనిచేసి పలువురికి ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. ఎన్సిఆర్టి, ఎస్ఇఆర్టి సమస్య వచ్చినప్పుడు ఎస్ఎఫ్ఐగా తాము చేసిన పోరాటానికి తగిన సలహాలు ఇచ్చి ముందుకు నడిపిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం విశాఖలో జరిగిన పోరాటాల్లో తాను పాల్గొనడమే కాకుండా, తన శిష్యులనూ, తోటి ఉద్యోగులనూ భాగస్వాములను చేయడం అభినందనీయమన్నారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ కృష్ణారావు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఐటిఐలో ఎంతో మంది ఆయన వద్ద విద్యనభ్యసించి ఉన్నతులుగా ఎదిగిన విషయాన్ని గుర్తుచేశారు. కుటుంబం యావత్తునూ మంచి మార్గంలో నడిపించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఐటిఐ పూర్వ అసిస్టెంట్ డైరెక్టర్ తోడర్మల్ మాట్లాడుతూ ఐటిఐల అభివృద్ధికి కృష్ణారావు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ స్కూల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, కవి బొడ్డ కూర్మారావు, ఐటిఐల్లో వివిధ హోదాల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులు, పలువురు ప్రిన్సిపాళ్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జర్నలిస్టు కోడూరు అప్పలనాయుడు రచించిన 'నిత్య శ్రామికుడు.. కృష్ణారావు' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. రచయిత ప్రయత్నాన్ని మెచ్చుకుంటూ సత్కరించారు.

దేహదాన అంగీకారపత్రం అందజేత

కృష్ణారావు మరణానంతరం ఆయన పార్థివ దేహాన్ని పరిశోధనల కోసం మెడికల్ విద్యార్థులకు అందజేస్తామంటూ జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహ సంస్థ బాధ్యులు ఎం.అన్నపూర్ణకు కృష్ణారావు భార్య స్వరాజ్యరాణి, కుమారుడు వై.సత్యనారాయణ, కోడలు అనురాధ అంగీకారపత్రం అందజేశారు. వారికి అన్నపూర్ణ ధన్యవాదాలు తెలుపుతూ మాట్లాడారు. దేహదానం ప్రాధాన్యతను సభా వేదికగా వివరించారు.



దేహదాన అంగీకార పత్రాన్ని అందజేస్తున్న కృష్ణారావు, చిత్రంలో లోకనాథం, గంగారావు, కృష్ణారావు కుటుంబీకులు







అధిక విద్యుత్ బిల్లులతో..

వినియోగదారుల బెంబేలు

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం మేజర్ పంచాయితీ కొత్తకోటలో అధిక విద్యుత్ బిల్లులు రావడంతో వినియోగదారులు బెంబేలు ఎత్తి పోతున్నారు. గ్రామంలో విద్యుత్ మీటర్లు రీడింగ్ నమోదు ఈ నెలలో సకాలంలో నమోదు చేయక పోవడంతో రీడింగ్ లో వేలకు వేలు విద్యుత్ బిల్లులు వస్తూన్నాయని వినియోగ దారుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో ద్వారపు రెడ్డి శ్రీను ఇంటి విద్యుత్ మీటర్ సర్వీస్ నెంబర్ 4136 కు రూ.25 వేల 374 బిల్లు రావడంతో సదరు వినియోగ దారుడు బెంబేలు ఎత్తి పోయాడు.అలాగే గ్రామంలో వేమవరపు శివ కు చెందిన ఐస్ తయారీ చేసే చిన్న కుటిర పరిశ్రమ కు సర్వీస్ నెంబర్ 681 కు ప్రతి నెల సుమారు రూ 11 వేల లోపు విద్యుత్ బిల్లులు రాగా ఈ నెల సుమారు రూ.88 వేల 709 లకు పైగా బిల్లు రావడంతో వినియోగ దారుడు శివ తీవ్ర ఆందోళన గురి అవుతున్నాడు. సర్వీస్ నెంబర్ 4050 (వేమవరపు రమేష్)కు ప్రతి నెల రూ 9 వేలు లోపు బిల్లు వస్తుండ గా ఈ నెల సుమారు రూ 32 వేల 648 ల బిల్లులు రావడంతో వినియోగ దారుడు రమేష్... అంత బిల్లు ఎందుకు వచ్చిందో అర్ధం కాక ఆందోళన పడుతున్నాడు.

గ్రామంలో గృహ వినియోగ దారులకు కూడా అధిక విద్యత్ బిల్లులు వస్తుండడం తో వినియోగ దారులు బేంబేలు ఎత్తి పోతున్నారు. గత ఆరు నెలలుగా ప్రభుత్వం వినియోగ దారునికి తెలియ కుండా, అనుమానం రాకుండా ట్రూ ఆఫ్ ఛార్జిల పేరుతో మరింత అదనపు భారం మోపుతుంది. ప్రతి నెల 30 రోజులకు ఒక సారి రీడింగ్ నమోదు చేయాల్సిన సిబ్బంది ఈ నెల 40 రోజులు దాటిన తర్వాత రీడింగ్ నమోదు చేయడంతో ఈ దుస్థితి వచ్చిందన్న ఆరోపణలు ఉన్నాయి.ఈ సమస్య పై స్థానిక విద్యుత్ శాఖ సిబ్బందిని వివరణ కోరగా ప్రభుత్వం నూతనంగా విద్యుత్ వినియోగ దారుల వివరాలు సేకరణలో భాగంగా ఆధార్ కార్డు లింక్ చేయాల్సిన బాధ్యత ఉండటంతో రీడింగ్ సేకరణ కు కొంత ఆలస్యం అయిందని పేర్కొన్నారు. అధిక బిల్లులు వచ్చిన వినియోగ దారుల సమస్య పై జిల్లా, మండల స్థాయి అధికారుల దృష్టి కి తెలిపామన్నారు.



అధికంగా వచ్చిన విద్యుత్ బిల్లులు